కథ

వియోగి

# అవకాశం

"నాకు ఆ అబ్బాయి నచ్చలేదు" చెప్పింది లావణ్య.

నివ్వెరపోయింది ఆమె తల్లి సీతమ్మ. ఈ జవాబు తన కూతురు నుంచి ఆమె ఆశించలేదు. "అబ్బాయి నచ్చాడా?" అని ఊరికే ఫార్మాలిటీకి - మాటవరుసకు అడిగింది. అసలు ఈ కాలంలో ఎంతమంది తల్లిదండ్రులు అమ్మాయి మనసు కనుక్కుని పెండ్లి చేస్తున్నారు కనుక?

తన కూతురు తన మాట కాదనదు అన్న ధైర్యంతో రేపొద్దున్న ఏదైనా పొరపాటు జరిగితే తనను సాధించకూడదు అన్న ఉద్దేశ్యంతో "ఏమే! అబ్బాయి నీకు బాగా నచ్చాడు కదుటే" అని అడిగింది.

కానీ ఇలా పిడుగులాంటి జవాబు వినవలసి వస్తుందని ఆమె అనుకోలేదు.

కుదరక కుదరక - చూడక చూడక అన్ని రకాలుగా బావున్న సంబంధం కుదిరిపోయిందిలే అని తను, భర్త రాంగోపాలు సంబరపడిపోతున్నారు.

రేపో ఎల్లుండో వచ్చి తాంబూలాలు పుచ్చుకుని - లగ్నపత్రిక రాసుకోవడం తరువాయి.

అలాంటి సమయంలో లావణ్య బాంబు పేల్చింది.

కొంచెం ముభావంగా ఆలోచిస్తూ కనిపిస్తే ఆమెకు సిగ్గు ముంచుకొచ్చిందిలే అని తను అనుకుంటున్నది.

"లావణ్యా! నిజంగా అంటున్నావా? తమాషాకు అంటున్నావా? ఇది జీవితం, జోకులు పనికిరావు" కోప్పడింది.

"జీవితం? ఎవరిది మీదా నాదా?" లావణ్య ప్రశ్న.

"నీదేనే! మరీ చోద్యంగా మాట్లాడతావు?"

"అయితే నాకీ సంబంధం యిష్టం లేదు" కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది.

"ఒసే నీ దుంపతెగ, మరి ఇంత దూరం వచ్చేదాకా ఎందుకు నోరుమూసుకు కూర్చున్నావే! అప్పుడే చెప్పచ్చుగా!" నోరు నొక్కుకుంది సీతమ్మ.

"నన్ను నువ్వడిగింది ఇప్పుడేగా!" తాపీగా చెప్పింది.

"నీకిదేం పొయ్యే కాలమే! పెండ్లిచూపులు జరిగాయి. అంతా మాట్లాడుకున్నాం, జాతకాలు కుదిరాయి అటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలు చూసుకున్నాం. అంతా ఓకే అనుకునే గదా తాంబూలాలు పుచ్చుకుందామని మీ నాన్న కబురు చేసింది. అప్పుడే చెప్పి ఉంటే అప్పుడే మానేసే వాళ్ళంగా!" బాధపడింది.

"కూతురు పెండ్లికి కూతురు ఇష్టం కనుక్కుందామన్న ఇంగిత జ్ఞానం మీకుంటే పెళ్ళిచూపులు అయిన తర్వాత నా అభిప్రాయం అడిగే వాళ్ళు!" లావణ్య చెప్పింది.

"నువ్వు మౌనంగా ఉంటే యిష్టపడ్డావనుకున్నాం. అయితే ఏ ఆడపిల్ల నోరు తెరిచి నాకు పెళ్ళి చేయమని అడుగుతుంది. అది మా బాధ్యత కాబట్టి మేమే చేద్దామనుకున్నాం" వాపోయింది సీతమ్మ.

"మౌనం అర్ధ అంగీకారం అనుకునే బదులు మౌనం అయిష్టం అనుకోవచ్చుగా" లావణ్య అంది.

"అయినా ఆ అబ్బాయిలో కాని, ఆ సంబంధంలో కాని నచ్చని విషయమేముంది. బిటెక్ చదివాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. ఆస్తి వుంది. సాంప్రదాయ కుటుంబం. వినయ విధేయతలున్నాయి" చెప్పుకుపోతున్నది సీతమ్మ.

"ఆగమ్మా! అన్నీ ఉన్నాయి కాని అందం ఉందా?" లావణ్య.

"ఫర్వాలే కాస్త చామనఛాయ - బాగానే ఉన్నాడు" సీతమ్మ.

"బాగానే అంటున్నావంటే నీకే నచ్చలేదన్నమాట. అంటే అందంగా లేని వాడ్ని నే చేసుకోవాలి" లావణ్య నిలదీసింది.

"అందం కొరుక్కుతింటామా? అయినా మొగాడికి అందమేంటే? కాళ్ళు చేతులు బాగున్నాయి. మంచివాడు" కొట్టేసింది సీతమ్మ.

"అంటే అందం ఆడదానికే కావాలి కాని మొగాడికి అక్కరలేదా? అంతకు ముందువాళ్ళు పాతిక సంబంధాలు చూశారు. ఎక్కువ కట్నం యిస్తామని వెంటపడ్డా వద్దనుకుని నా దగ్గరికి వచ్చారు. ఎందుకట?" లావణ్య సాలోచనగా అడిగింది.

"వాళ్ళందరికంటే నువ్వు అందంగా వున్నావని కదే నిన్ను యిష్టపడింది" తేలిగ్గా చెప్పింది.

"అంటే అందంగా ఉండకపోతే నన్ను చేసుకుంటానని చెప్పేవాళ్ళు కాదు - అంతేగా?" లావణ్య లాజిక్కు.

"అంతేగా మరి!" సీతమ్మకు అర్ధం కాలేదు.

"అందానికి అంత విలువ వాళ్ళిస్తున్నప్పుడు - ఆ అబ్బాయిలో ఏమాత్రం అందం ఉందో నేను చూడ్డంలో తప్పుందా? అతని అందం నాకు నచ్చద్దా?" లా పాయింటు తీసింది.

"నీ కర్మ! మొగాడిలో అందం చూసేదాన్ని నిన్నే చూశాను. ఈ సంబంధం నీలాంటి ఏ ఆడపిల్లకొచ్చినా గంతులేసి చేసుకునేది. అయినా అతను అంత కురూపి ఏం కాదు. తీసేయ దగ్గవాడు కాదు. అందం కొరుక్కు తింటామా ఏంటి?" దీర్ఘాలు తీసింది చేతులూపుకుంటూ సీతమ్మ.

"అది నీ ఉద్దేశం కావచ్చు" నిర్లక్ష్యంగా చెప్పింది లావణ్య.

"ఇంతకీ నువ్వేమంటావే!" చికాగ్గా అడిగింది.

"నాకూ ఆ అబ్బాయికి మధ్య వయసు తేడా చాలా ఎక్కువుంది" లావణ్య ఇంకో పాయింటు లేవదీసింది.

"ఎంతుందేంటే...ఆరు సంవత్సరాలు..అతనేం ముసలాడు కాదు. రెండవ సంబంధం వాడు కాదు. ఆరు సంవత్సరాలు ఈడు-జోడు కిందే లెక్క" కొట్టేసింది.

"కాదు..ఆరు సంవత్సరాల అంతరం ఉంటే ఈ కాలం ఏ పిల్లా పెండ్లికి ఒప్పుకోవడం లేదు" లావణ్య చెప్పింది.

"అదేం మాయరోగం. మా కాలంలో పది పన్నెండు సంవత్సరాలు ఎక్కువున్నా చేసుకున్నాం" గుర్తుచేసుకుంది.

"అది మీ కాలం. ఈ కాలంలో ఆడపిల్లలు ఒకటి, రెండు సంవత్సరాల తేడా కంటే ఎక్కువ యిష్టపడ్డం లేదు. మొగాడు ఇప్పుడు బాగున్నా ఓ పదేళ్ళ తర్వాత తొందరగా ముసిలాడు అయిపోతాడు. ముప్పై అయిదు సంవత్సరాలు దాటిందంటే బిపి, షుగరు లాంటి రోగాలు ఎటాక్ అవుతున్నాయి. దాంతో వయసు పైబడ్డట్టు కనిపిస్తాడు" లావణ్య చెప్పింది.

"ఒసే వాజమ్మ.. నిజానికి ఆడదేనే అలా అనిపించేది. రెండు కాన్పులు అయితే ఎక్కడలేని వయసు ముంచుకొస్తుంది. అయినా నాకెందుకు గాని నిన్ను చిన్నప్పటి నుంచి గారాబం చేసి నెత్తిన పెట్టుకున్నాడే మీ నాయనకే చెప్పు" విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

రాంగోపాలు యింటికి వచ్చేసరికి వాతావరణం గంభీరంగా మారిపోయి ఉంది. ఇంట్లో ఉన్న ఒక్క గారాలపట్టి ఎదురు రాకపోవడం, చిరునవ్వులు చిందించే శ్రీమతి టీవీకి అతుక్కుపోయి ఉండడం రాంగోపాలుకు వింతగా కనిపించింది.

"ఏమేవ్.. ఎల్లుండికి ఏఏ ఏర్పాట్లు కావాలో ఒకసారి కాగితం మీద రాసివ్వు. ఏ పొరపాటు జరగకూడదు. మనింట్లో జరిగే మొదటి శుభకార్యం" బట్టలు మార్చుకుంటూ చెప్పాడు.

టీవీ శబ్దాలు తప్ప యింకే గొంతు వినపడలేదు.

"లావణ్యా! కాస్త మంచినీళ్ళు యియ్యమ్మా!" గదిలోకి కేక వేశాడు లావణ్య నీళ్ళు అందించింది.

"ఏమ్మా! ఒంట్లో బాగోలేదా?" ప్రేమగా అడిగాడు.

"లేదు డాడీ! బాగుంది" తలవంచుకుని చెప్పింది.

"అమ్మకు కోపం వచ్చినట్లుంది!" అడిగాడు.

"మామూలేగా" లావణ్య పెదవి విరిచింది.

"కారణం ఏంటో?" రాంగోపాలు ప్రశ్న.

"మీరే అడగండి" లావణ్య చెప్పింది.

"ఏమేవ్! ఛానల్సులో నీకిష్టం లేని సిన్మా వేశారా? లేదా నీకిష్టమైన సీరియల్‌లో ఏ పాత్ర యినా అనవసరంగా చచ్చిపోయిందా?" ఎగ తాళిగా అన్నాడు.

"అంతే మీకర్థమయ్యేది. ఇంట్లో ఎది గిన కూతురుంది. దాని యిష్టాయిష్టాలు కనుక్కోవాలన్న తెలివి ఉంటేగా?" సాధిం చింది సీతమ్మ.

"బాగుంది. నిన్నటి దాకా ఎదిగిన కూతురుంది. పెండ్లి చేయాలని గొణిగే దానివి తీరా అది అవుతుండగా ఇంకో కొత్తమాట మొదలెట్టావు. నా కూతురు యిష్టాయిష్టాలు నాకంటే నీకు బాగా తెల్సు!" రాంగోపాలు గర్వంగా అన్నాడు.

"అదే... ఆ అహంకారమే పనికిరాదంది. దాన్ని కను క్కోండి ముందు" కోపంగా అరిచింది సీతమ్మ.

"లావణ్య! ఈ చిక్కుముడి నువ్వే విప్పాలమ్మా! ఫార్మా ల్టీసులో లోపం జరుగుతున్నదా?" ఆశ్చర్యంగా అడి గాడు.

లావణ్య మాటలాడలేదు.

"దానికి అస్సలు ఈ సంబంధమే యిష్టం లేదుట!" కోపంగా చెప్పింది సీతమ్మ.

స్టన్ అయిపోయాడు రాంగోపాలు నెత్తిన పిడుగు పడ్డ ట్టయింది. కోలుకోవడానికి కొన్ని నిముషాలు పట్టింది.

"ఏమ్మా! లావణ్యా! ఈ పెండ్లి చేసుకోవా! ఈ బీద తండ్రి కుదిర్చిన సంబంధం చేసుకోవా?" దీనంగా అడి గాడు లావణ్య చేతులు పట్టుకుని.

"లేదు నాన్నా! ఎప్పుడూ నేనా మాట అనలేదు" బాధగా అంది.

"అదేంటే ఇందాకే గదే నాతో చెప్పింది నువ్వు!" సీతమ్మ విస్తుపోతూ అడిగింది.

లావణ్య తలదించుకుంది.

"లావణ్య నిజం చెప్పమ్మా! ఈ పెండ్లి చేసుకోవా?" కళ్ళ నీళ్ళ పర్యంతం అవుతూ అడిగాడు రాంగోపాలు.

"డాడీ! నేను చేసుకోనని చెప్పలేదు" జీరపోయిన గొంతుతో చెప్పింది.

"అవ్వ! రెండు నాలుకల మనిషి నీ మనసులో ఉన్నది చెప్పవే! మమ్మల్నెందుకే ఏడిపిస్తావు" సీతమ్మ ఆక్రోశిం చింది.

"అయితే ఎల్లుండి నిశ్చితార్థం చేసుకుందామా!" అడి గాడు.

"నీ యిష్టం డాడీ! నువ్వు ఎవరిని చేసుకోమంటే వాళ్ళను చేసుకుంటాను. ఎవరిని చూపిస్తే వాళ్ళ చేత మెడలు వంచి



కథా నిలయం
శ్రీకాకుళం

తాళి కట్టించుకుంటాను" రాబోతున్న కన్నీటిని ఆపుకుంటూ చెప్పింది లావణ్య.

"దానికి ఈ సంబంధం యిష్టం లేదని నా మొహాన చెప్పింది" సీతమ్మ అందించింది.

"ఏమ్మా! లావణ్యా! ఈ సంబంధం యిష్టం లేదా" అడిగాడు.

"డాడీ! చేసుకోవడం వేరు ఇష్టపడ్డం వేరు" లావణ్య బరువుగా చెప్పి గదిలోకి పోయి తలుపు గడియ పెట్టుకుంది.

రాంగోపాలు నిశ్చేష్టుడయ్యాడు.

రాంగోపాలు మధ్యతరగతి మానవుడు, బ్రతకలేని బడిపంతులు. దేవుడి దయవలన గవర్నమెంటు జాబ్ వచ్చి బుద్ధిగా ఉద్యోగం చేసుకుంటూ తనకున్న నలుగురు పిల్లల్ని పైకి తెస్తున్నాడు. లావణ్య పెద్దకూతురును ఎమ్మే బియిడి చేయించి ఓ ప్రైవేట్ స్కూల్లో టీచరు పోస్టు వేయించాడు. రెండో అబ్బాయి ప్రభాకర్ మార్కాపురంలో ఇంజనీరింగు చేస్తున్నాడు. మూడవ అమ్మాయిని హైదరాబాద్‌లో కాల్ సెంటర్‌లో చేర్పించాడు డిగ్రీతో మాన్పించి. నాలుగవ అబ్బాయిని రెసిడెన్షియల్ కాలేజీలో లాంగ్ టర్మ్ కోచింగ్ యిప్పిస్తున్నాడు.

ఆర్థిక యిబ్బందులు కాస్త ఎక్కువే. పూర్వీకులు యిచ్చిన ఆస్తిని హారతి కర్పూరంలా కరిగించి వేశాడు. తన జాబే కాకుండా, కొన్ని స్కూళ్ళల్లో ప్రైవేటు క్లాసులు తీసుకుంటూ ఉంటాడు.

రాత్రింబగళ్ళు కష్టపడుతున్నాడు అతనికి మిగిలిన తృప్తి తన పిల్లలు బాగా ఎక్కి వస్తున్నారని. తన మాట కాదనరని. అందులో మొదటి సంతానం లావణ్య పేరుకు తగ్గట్టు కుందనపు బొమ్మ. ఆ పాపంటే అతనికి ప్రాణం.

ఆమె అదృష్టం కొద్దీ రాఘవేంద్ర అమ్మాయిని ఇష్టపడ్డాడు. వాళ్ళు తమకంటే ఎంతో పై స్థాయిలో ఉన్నారు ఆర్థికంగా. అయినా లక్షలు వచ్చే కట్నం కాలదన్నుకుని మీరిచ్చింది పుచ్చుకుని అమ్మాయిని చేసుకుంటామని వస్తున్నారు. ఒక రకంగా వాళ్ళ వాళ్ళకు యిష్టం లేకపోయినా అబ్బాయి బలవంతం మీద వాళ్ళు తలవంచారు.

సీతమ్మ పూసగుచ్చినట్లు జరిగింది చెప్పింది.

హతాశుడైపోయాడు.

పిచ్చి పట్టినట్లయింది. ఇన్నాళ్ళు కూతురు యిష్టం కాదని ఒక్క పని చెయ్యలేదు. సంబంధం చాలా బావుందని లావణ్య తన మాట కాదనదని ఓవర్ కాన్ఫిడెన్స్‌తో మంచి సంబంధం వచ్చిందని పదిమంది అనడంతో ఆమె మనసు తెలుసుకోవాలన్న ఆలోచన రాలేదు.

చాలా చాలా ముందుకెళ్ళిపోయారు. ఇప్పుడు కాలు వెనక్కు తీసుకున్నా కుటుంబ మర్యాద పోతుంది. నాలుగు రకాలుగా నలుగురూ వ్యాఖ్యానిస్తారు.

ఆ రాత్రి ఆలోచనలతో నిద్రపట్టలేదు.

"డాడీ! కాఫీ!" నవ్వుతూ లావణ్య కాఫీ యిచ్చింది.

"హమ్మయ్య! ఇష్టపడ్డావా రాఘవేంద్రను" సంతోషంగా అడిగాడు.

"డాడీ! నీకు కావాల్సింది పెళ్ళి. నాకు కావాల్సింది తాళి! క్యారీ ఆన్..మధ్యతరగతి మానవులం" చిరునవ్వుతో చెప్పింది.

రాంగోపాలు గుండెను ఎవరో నొక్కినట్లయింది.

భార్యతో ఆలోచించాడు...

"దాని మొహం! చిన్నపిల్ల..దాన్ని అడిగేదేంటి..చేసేయ్యండి..బంగారంలాంటి సంబంధం మన జన్మలో మళ్ళీ మనకీ అవకాశం రాదు" చెప్పింది సీతమ్మ.

రాంగోపాలు పిచ్చివాడిలా తనకు ఆత్మీయులుగా ఉన్న నలుగురు ఫ్రెండ్సుతో డిస్కస్ చేశాడు ఈ విషయం. ఇద్దరు చేయమన్నారు. ఇద్దరు వద్దన్నారు.

సీతమ్మ చిందులు వేస్తూ సాధిస్తున్నది.

రాఘవేంద్ర వైపునుండి ఎప్పుడు నిశ్చితార్థం అని కబుర్లు వస్తున్నాయి.

రాంగోపాలు ఓ రాత్రి పూట లావణ్యను మేడపైకి తీసుకుపోయి అడిగాడు.

"అమ్మా! లావణ్య! చిన్నప్పటి నుండి నీ కోరిక ఏదీ కాదనలేదు. అందుకే అడుగుతున్నాను. ఈ రాఘవేంద్ర సంబంధం నీకిష్టమేనామ్మా! పెండ్లి చేసుకుంటావా?"


"డాడీ! చెప్పానుగా మీరెవ్వరిని చేసుకోమంటే వాళ్ళను చేసుకుంటాను" లావణ్య చెప్పింది.

"అది కాదమ్మా! నీకిష్టమా కాదా?" సూటిగా అడిగాడు.

"నచ్చలేదని చెబితే యిప్పుడేం చెయ్యగలరు? ఇంత దూరం వచ్చిం తర్వాత? మన కుటుంబ పరువు పోదా?" లావణ్య ప్రశ్న.

"అమ్మా! పెళ్ళి చేసుకున్న తర్వాత అతన్ని ప్రేమించలేవా?"

"ఏమో! కొందరంటే ఎందుకు అయిష్టమో అర్థం కాదు" లావణ్య.



"సరే! నీ ఇష్టప్రకారమే ఇది కాన్సిల్ చేస్తాను" బాధగా అన్నాడు.

ఆ తరువాత రాంగోపాలు సాహసమైన చర్య తీసుకుని తన ఇంకో కూతురును రాఘవేంద్రకు చూపించి - వప్పించి పెళ్ళి చేశాడు. మాలతి కూడా లావణ్యకు తీసిపోదు. రాఘవేంద్ర ప్రాక్టికల్ మనిషి కాబట్టి వెంటనే ఒప్పేసుకున్నాడు.

కాల్‌సెంటర్‌లో పనిచేస్తున్న మాలతికి లోకం ఏమిటో అర్థమైంది కాబట్టి అందం గిందం పక్కనబెట్టి తన జీవితానికి ఏది కావాలో ఆలోచించుకుని చేసుకుంది.

కాలం గిర్రున తిరిగిపోయింది.

మాలతికి యిద్దరు పిల్లలు, ముచ్చటగా కాన్వెంట్లలో చదువుతున్నారు.

మొగబ్బాయిలకు పెండ్లిళ్ళు అయి ఉద్యోగాలు వెతుక్కుంటూ వాళ్ళ పెళ్ళాలను తీసుకుని వెళ్ళిపోయారు.

ఇప్పుడా యింట్లో రిటైరైన రాంగోపాలు - మంచాన పడిన సీతమ్మ - సంబంధాల కోసం ఎదురుచూస్తున్న లావణ్య మిగిలారు. ఎందుకో ఆమెకు కొన్ని సంబంధాలు నచ్చడం లేదు. ఆమెకు నచ్చిన సంబంధాల వాళ్ళకు ఈమె నచ్చడం లేదు.

లావణ్యకు తను బ్రతికుండగా పెళ్ళి అవుతుందాని రాంగోపాలు కుమిలిపోతూ ఉంటాడు.

"అమ్మా! లావణ్యా! నువ్వు ఆ సంబంధం చేసుకుని ఉండాల్సింది" అప్పుడప్పుడు బాధపడుతూంటాడు రాంగోపాలు.

"డాడీ! తెలిసీ తెలియని వయసులో అనుభవ రాహిత్యంతో నేను కాదన్నాననుకోండి - కనీసం మీరైనా బలవంతంగానైనా నా పెళ్ళి చేయాల్సింది" లావణ్య నిష్ఠూరాలాడుతూ ఉంటుంది.

అవకాశాలు మళ్ళీ మళ్ళీ రావు. అదృష్టం తలుపు తట్టినప్పుడు ఆహ్వానించాలని లావణ్య గుణపాఠం నేర్చుకునే లోపు లావణ్యలోని లావణ్యం వడలిపోయింది.

## ప్రేమ కోసమేనా?

*ప్రకాష్ ఝా తీస్తున్న కొత్త చిత్రంలో నానాపటేకర్, అజయ్‌దేవ్‌గన్ లాంటి ప్రముఖ నటులతోపాటు రణబీర్ కపూర్ కూడా నటిస్తున్నాడు. అయితే ఈ సినిమాలో తనకి వేషం ఇలా ఆఫర్ చేయగానే అలా ఎగిరి గంతేసి ఒప్పుకుందిట దీపికా పదుకొనె. రణబీర్‌తో కలిసి నటించే చాన్స్ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసే దీపికకి మరి పండగే కదా! అంతా ప్రేమమయం అని బాలీవుడ్ జనాలు చెవులు కొరుక్కుంటున్నారు.*